క్లుప్తంగా

పారిశుద్ధ్యం పనులు ముమ్మరం



మురుగును తొలగిస్తున్న మున్సిపల్ కార్మికులు

నారాయణఖేడ్: వర్షాకాలం సమీపిస్తున్నందున మున్సిపాలిటీ పరిధిలో సోమవారం నుంచి పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేశారు. సాయి బాబాకాలనీ, భవానీకాలనీలతో పాటు మరికొన్ని కాలనీల్లోని మురుగుకాల్వల్లో పేరుకుపోయిన మురుగును తొలగించి ట్రాక్టర్లతో తరలించారు. జిల్లాపరిషత్ బాలికల ఉన్నతపాఠశాల వద్ద జేసీబీతో మురుగును తొలగించారు. వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నామని శానిటరీ అధికారి శ్రీనివాస్ తెలిపారు.

నీటి సరఫరా పునరుద్ధరణ



బోరుకు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించారు. వాసవీ కాలనీలో మున్సిపాలిటీకి సంబంధించిన బోరు పనిచేయకపోవడంతో కొద్ది రోజులుగా నీటిసమస్య తీవ్రమైంది. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్ సూచనతో సోమవారం కౌన్సిలర్లు సవిత హన్మాండ్లు, వివేకానంద్ సిబ్బందితో బోరుకు మరమ్మతులు చేయించారు. నీటిసరఫరాను పునరుద్ధరించారు.

బాక్సింగ్‌లో భవజ్ఞకు బంగారు పతకం



గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థిని భవజ్ఞకు అవార్డు అందిస్తున్న పోటీ నిర్వాహకులు

హత్నూర(సంగారెడ్డి): కిక్ బాక్సింగ్‌లో మండలంలోని గుండ్ల మాచనూర్‌కు చెందిన నీరుడి భవజ్ఞ జాతీయస్థాయిలో బంగారు పతకం సాధించింది. ఈనెల 22 నుంచి 26 వరకు మహారాష్ట్ర పూణేలో జరిగిన జాతీయ స్థాయి చిల్డ్రన్, క్యాడేట్ నేషనల్ లెవెల్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్–24 పోటీల్లో సత్తా చాటింది. అండర్ –10 విభాగం పాయింట్ ఫైట్ లో గోల్డ్ మెడల్, మ్యూజికల్ పెర్ఫామెన్స్‌లో బ్రాంజ్ మెడల్ సాధించింది. అభినందనలు తెలిపిన వారిలో కిక్ బాక్సింగ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, జాయింట్ సెక్రెటరీ, సంగారెడ్డి పోచయ్య, కోచ్‌లు వర్షిత, మహేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

కేతకీలో భక్తుల సందడి



కేతకీలో కంట్లం పూజలు చేస్తున్న భక్తులు

ఝరాసంగం(జహీరాబాద్): కేతకి సంగమేశ్వర ఆలయం భక్తులతో సందడి నెలకొంది. సోమవారం తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ఆవరణలోని అమృత గుండంలో పుణ్య స్నానాలు ఆచరించి జల లింగానికి పూజలు చేశారు. అనంతరం గర్భగుడిలోని పార్వతీ పరమేశ్వరులకు దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భాగంగా అభిషేకం, కంట్లం, కేశఖండనం, కుంకుమార్చన, వాహన పూజ తదితర పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 20మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 20మంది వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ శ్రవణ్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శని, ఆదివారం నిర్వహించిన డ్రైవ్‌లో 20 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా, జడ్జి ఒక్కొక్కరికి రూ. 2 వేల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

నకిలీ విత్తులు అమ్మితే చర్యలు



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

సంగారెడ్డి టౌన్ : నకిలీ విత్తనాలు విక్రయించే వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మంజీరా రైతు సమైక్య జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్ కోరారు. సోమవారం జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నకిలీ విత్తనాలు ఇచ్చి నష్టం కలిగించవద్దని అన్నారు.

సలహాలు సూచనలు పాటించాలి

ఝరాసంగం(జహీరాబాద్): పంటల సాగులో అధికారుల సలహాలు సూచనలు పాటించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం మండలంలోని కక్కర్ వాడ, మాచ్నూర్, కుప్పా నగర్, చీలమామిడి గ్రామాలలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ లైసెన్స్ ఉన్న దుకాణాలలో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. వాటికి సంబంధించిన బిల్లులు భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఏఈఓలు సుకుమార్, హరికృష్ణ, వినోద్, సంపత్, రేణుక, శివ ప్రియ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దు



డప్పూర్‌లో విత్తనాలు కొనుగోలు అంశంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ లావణ్య



మాట్లాడుతున్న మండల వ్యవసాయ శాఖ అధికారి

న్యాల్‌కల్(జహీరాబాద్): తక్కువ ధరకు లభిస్తున్నాయని నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దని మండల వ్యవసాయ శాఖ అధికారి లావణ్య రైతులకు సూచించారు. సోమవారం మండల పరిధిలోని డప్పూర్, ఖలీల్‌పూర్, బసంత్‌పూర్, హద్నూర్, చీకూర్తి, శంశల్లాపూర్, చాల్కి, మిర్జాపూర్(ఎన్) తదితర గ్రామాల్లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. విత్తనాల కొనుగోలు విషయంలో ఏమైనా అనుమాలు ఉంటే ఏఈఓలను సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓలు షరీఫ్, సాయిలు, రైతులు పాల్గొన్నారు.

రశీదులు తప్పనిసరి

వట్‌పల్లి(అందోల్): విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పక రశీదులు తీసుకోవాలని జోగిపేట ఏడీఏ అరుణ సూచించారు. సోమవారం అందోల్ మండల పరిధిలోని మాసాన్‌పల్లి, చింతకుంట, అక్సాన్‌పల్లి, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లైసెన్స్ ఉన్న షాపుల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. 60 మిమీ కన్నా మించి వర్షపాతం నమోదైన వెంటనే విత్తనాలను విత్తుకోవాలని సూచించారు. లూస్ బ్యాగుల్లోని విత్తనాలను కొనుగోలు చేయరాదని, ఎవరైనా అమ్మితే సమాచారం ఇవ్వాలని తెలిపారు. హెర్బిసైడ్ టోలరెంట్ కాటన్ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఓ విజయరత్న, ఏఈఓలు శ్రీనివాస్, శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ అరుణ

కూలీలకు సదుపాయాలు కల్పించాలి

రాయికోడ్(అందోల్): జాతీయ ఉపాధి హామీ పథకం పనులుచేసే కూలీలకు సదుపాయాలు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహులు డిమాండ్ చేశారు. మండలంలోని రాయికోడ్, కుసునూర్ గ్రామాల్లో ఉపాధి కూలీలు పనిచేస్తున్న ప్రాంతాలను సోమవారం స్థానిక వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దశరథ్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పథకం సాఫ్ట్‌వేర్‌ను రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్ర ప్రభుత్వానికి బదిలీ చేయడంతో కూలీలకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. పని ప్రదేశంలో పనిముట్లు, తాగునీరు, నీడ, మెడికల్ కిట్లు లేకపోవడంతో కూలీలు ఇబ్బంది పడుతున్నారన్నారు. కూలీలు చేసిన పనులకు సకాలంలో డబ్బులు రావడం లేదని ఆరోపించారు. ఉపాధి కూలీలకు రోజుకు రూ.800 చెల్లించాలని డిమాండ్ చేశారు. కూలీల సమస్యలను పరిష్కరించకపోతే వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, సభ్యులు దశరథ్, మీనాక్షి, సంపూర్ణ, నర్సమ్మ, నవీన్, మాణెయ్య, రామచంద్ర, రుక్కమ్మ, బేతయ్య, యాదుల్, రాములు, సిద్దన్న, రవి పాల్గొన్నారు.

మా ప్లాట్లను పరిరక్షించండి

- బాలాజీ నగర్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్
- సందర్శించి పరిశీలించిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఖాజ

పటాన్‌చెరు టౌన్: బాలాజీ నగర్ ప్లాట్లను పరిరక్షించి న్యాయం చేయాలని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవీ రావు, శరత్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం పటాన్‌చెరు శివారులోని బాలాజీ నగర్ (బంగారు గడ్డ)లోని ప్లాట్లలో గుర్తుతెలియని వ్యక్తులు ప్రహరీ నిర్మించారని ఫిర్యాదు చేయడంతో ఆర్ఐ ఖాజా వచ్చి పరిశీలించారు. అనంతరం వాటిని తొలగించారు. ఈ సందర్భంగా ప్లాట్ ఓనర్స్ విలేకరులతో మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం 1987 సంవత్సరంలో నాలా కన్వెన్షన్ చేసి, లేఅవుట్ రహదారులతో అభివృద్ధి చేశామని తెలిపారు. ఈ మధ్యకాలంలో కొందరు వ్యక్తులు 20 మంది ప్లాట్లను, రహదారులను కబ్జా చేయడానికి ప్రయత్నిస్తుంటే అధికారుల సాయంతో అడ్డుకున్నామని చెప్పారు. సంబంధిత అధికారులు తమ వద్ద ఉన్న పేపర్లను పరిశీలించారు. అన్ని విధాలుగా అర్హులైన ప్లాట్ ఓనర్లకు రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు అన్ని విధాలుగా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రాకేష్ రెడ్డి, సాయిరాం, శివరామకృష్ణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జహీరాబాద్: పట్టణంలోని పలు కాలనీల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఏఈ ఎస్.నాగరాజు తెలిపారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు ఆదర్శనగర్ కాలనీ, దత్తగిరి కాలనీ, సాయిరాంనగర్ కాలనీ, వసంత్‌విహార్, అల్లీపూర్ గ్రామం, చెన్నారెడ్డి నగర్ కాలనీల్లో కరెంట్ ఉండదని పేర్కొన్నారు. 33/11 కేవీ జహీరాబాద్ టౌన్ సబ్‌స్టేషన్ నుంచి అల్లీపూర్ ఫీడర్ మీద ఉన్న ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు తొలగింపు పనులు జరుగుతాయని చెప్పారు.

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని ఆరూర్, ఆత్మకూర్, నిజాంపూర్ సబ్ స్టేషన్లలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సదాశివపేట రూరల్ విద్యుత్ ఏఈ అశోక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాక్‌వెల్ ఫీడర్ జోగిపేట అత్యవసర మరమ్మత్తులు చేపడుతున్న కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కరెంట్ ఉండదని పేర్కొన్నారు.

బాధిత దళిత కుటుంబాన్ని ఆదుకోవాలి



మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్

సంగారెడ్డి టౌన్ : కులాంతర వివాహం చేసుకున్నాడని దళిత యువకుని ఇంటిపై దాడి చేసిన ఘటనలో తీవ్రగాయాలతో తండ్రి చనిపోయాడని, ఇందుకు కారణమైన కోహీర్ మండలం బడంపేట్‌కు చెందిన నిందితులపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతిమేల మాణిక్ అన్నారు. సోమవారం సంగారెడ్డిలోని ఆసంఘం కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత యువకుడు బేగరి రాజేష్ అదే గ్రామానికి చెందిన అగ్రకుల యువతిని ప్రేమించి వివాహం చేసుకున్నాడన్నారు. కొంతమంది అగ్రకులానికి చెందిన వాళ్లు అతడి ఇంటిపై దాడి చేయగా అతడి తల్లిదండ్రులకు తీవ్రగాయాలయ్యాయన్నారు. దీంతో యువకుడి తండ్రి నర్సింహులు హాస్పిటల్లో చికిత్స పొందుతూ మృతిచెందాడన్నారు. ఈ దారుణమైన ఘటనను కేవీపీఎస్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్యాయత్నం కేసులు పెట్టి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్, జిల్లా సహాయ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, జిల్లా కమిటీ సభ్యుడు చంద్రశేఖర్, శ్రీకాంత్, నాయకులు శ్రీహరి మల్లేశం భీమ్రావు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ ఎరువులు సద్వినియోగం చేసుకోవాలి



ఎరువులు పంపిణీ చేస్తున్న ఏవో శంకర్

నారాయణఖేడ్: సబ్సిడీపై అందజేస్తున్న జీలుగ, జనుముల ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శంకర్ కోరారు. సోమవారం ఖేడ్ వ్యవసాయ కార్యాలయంలో సబ్సిడీపై పచ్చరొట్ట ఎరువులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ క్వింటాలు జీలుగ పూర్తిధర క్వింటాలుకు రూ.9,300 కాగా రూ. 5,580 సబ్సిడీపోను రూ.3,720లకు అందజేస్తున్నామన్నారు. జనుము క్వింటాలుకు పూర్తిధర రూ.9,050 కాగా రూ.5,430 రాయితీపోను రూ.3,620లకు క్వింటాలు ఉంటుందని తెలిపారు. పచ్చరొట్ట ఎరువులతో కలిగే ప్రయోజనాలను రైతులకు వివరిస్తూ అవగాహన కల్పించారు. ఏఈఓలు సమత, సురేష్, రాందాస్, హరీశ్‌కుమార్, వినయ్ కుమార్, ఏటీఎం మారుతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూ సేవలు మరువలేనివి



నివాళి అర్పిస్తున్న నీలం మధు

పటాన్‌చెరు టౌన్: దేశ తొలి ప్రధాని నెహ్రూ సేవలు మరువలేనివని మెదక్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ అన్నారు. సోమవారం చిట్కుల్ గ్రామంలో నెహ్రూ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

నామ్‌కే వాస్తేగా సర్వసభ్య సమావేశం

పుల్‌కల్(అందోల్): నామ్‌కే వాస్తేగా సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సోమవారం అధికారులు సమర్పించిన నివేదికలపై, రైతుల ధా న్యం కొనుగోళ్ల ఆలస్యం , వేసవిలో నీటి ఎద్దడి తదితర సమస్యలపై చర్చ జరగలేదు. అధికారులు చదివి విన్పించిన నివేదికలపైనా చర్చించలేదు. సభ ప్రారంభమైన గంటలోపే అధికారుల నివేదికల అనంతరం సమావేశాన్ని ముగిస్తున్నామని ఎంపీడీఓ ఆనందమేరి తెలిపారు. కాగా, సమావేశానికి ఎంపీపీ చైతన్య విజయ్ భాస్కర్ రెడ్డి అధ్యక్షత వహించారు. సమావేశంలో ఎంపీటీసీలు శ్రీనివాస్ చారీ, మంజుల, దుర్గయ్య, మల్లమ్మ, మహేశ్వరి ఎంఈఓ అంజయ్య, ఏఈ పీఆర్ శశికుమార్ పాల్గొన్నారు.

స్వర్ణ దేవాలయంలో ఎమ్మెల్యే పూజలు



స్వర్ణ దేవాలయంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు : పంజాబ్ రాష్ట్రం అమృతసర్‌లోని స్వర్ణ దేవాలయాన్ని సోమవారం పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహగౌడ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, సీనియర్ నాయకులు దశరథరెడ్డి, వెంకట్‌రెడ్డి, పాండు, మాణిక్ ప్రభు, రాజు ఉన్నారు.

పత్తి విత్తన కొనుగోళ్లలో జాగ్రత్త



మాట్లాడుతున్న ఏఓ అభినాష్ వర్మ

రాయికోడ్(అందోల్) : పత్తి విత్తనాల కొనుగోలులో తగిన జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి అభినాష్ వర్మ సూచించారు. మండలంలోని ధర్మాపూర్, కుసునూర్, సింగితం, కర్చల్, ఔరంగానగర్ గ్రామాల్లో సోమవారం రైతులకు విత్తన కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలు కొనుగోలు చేసిన తర్వాత వ్యాపారి నుంచి తప్పక రసీదు పొందాలని సూచించారు. లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే కొనుగోలు చేయాలని సూచించారు. అధిక ధరలకు విత్తనాలను విక్రయిస్తే ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో శివకుమార్, రమేష్ ఉన్నారు.

ప్రమాదకరంగా రోడ్డు



కల్వర్టుకు ఇరువైపులా సేఫ్టీ లేకపోవటంతో ప్రమాదకరంగా ఉన్న రోడ్డు

జిన్నారం(పటాన్‌చెరు) : మండలంలోని ఖాజీపల్లి నుంచి మల్లంపేట వైపు ఇటీవల సీసీ రోడ్డు వేశారు. దీనికి ఇరువైపులా మట్టిని పోయకపోవటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే ఈ రోడ్డుపై కల్వర్టు ఉంది. దానికి ఇరువైపులా సేఫ్టీ లేకపోవటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా మట్టిని పోయించటంతో పాటు, కల్వర్టుకు ఇరువైపులా సేఫ్టీని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాల తనిఖీ



కొనుగోలు కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ

కల్హేర్(నారాయణఖేడ్): మండల పరిధిలోని బీబీపేట, సిర్గాపూర్ మండలం బోక్కస్‌గాంలో ధాన్యం కొనుగోలు కేంద్రలను ఆర్డీఓ అశోక్ చక్రవర్తి సోమవారం తనిఖీ చేశారు. రైతులకు ఇబ్బందులు లేకుండా జొన్నలు కొనుగోలు చేయాలని పీఏసీఎస్ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉమాశంకర్, ఎఈఓలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **జీలుగు విత్తనాలు పంపిణీ చేయాలి**



హత్నూర(సంగారెడ్డి): జీలుగు విత్తనాలు పంపిణీ చేయాలని హత్నూర మండలం రొయ్యపల్లి గ్రామస్తులు కోరారు. సోమవారం వ్యవసాయ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చే ఈ విత్తనాలు కొంతమేరకు వచ్చాయని, ఇంకా రైతులకు అవసరం ఉన్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ కు సమాచారం అందించాలని వ్యవసాయ శాఖ అధికారులకు కోరారు. ఇదిలా ఉండగా విత్తనాల కొనుగోలు పై రైతులకు అవగాహన సదస్సులను మండలంలోని పలు గ్రామాలలో వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించారు.

◆ **29న మండల సర్వసభ్య సమావేశం**

హత్నూర(సంగారెడ్డి): ఈనెల 29వ తేదీన హత్నూర మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శంకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే సమావేశానికి ఎంపీపీ అధ్యక్షత వహిస్తారని చెప్పారు. ఎంపీటీసీలు, పంచాయతీ ప్రత్యేక అధికారులు హాజరుకావాలని కోరారు.

◆ **ఇష్టరాజ్యంగా మాంసం విక్రయాలు**

శివ్వంపేట(నర్సాపూర్): పలు చికెన్ దుకాణాల్లో అనారోగ్యానికి గురైన కోళ్ల మాంసం అమ్మకాలు జరుపుతున్నారని పలువురు వినియోగదారులు వాపోయారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇలా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పశు వైద్యాధికారి సంధ్య దృష్టికి తీసుకెళ్లగా తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

◆ **నిప్పంటుకున్న ధాన్యం పరిశీలన**

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని పైతర గ్రామ శివారులో కల్లాల వద్ద ప్రమాదవశాత్తు నిప్పురవ్వలు పడిన కాలిన ధాన్యం కుప్పలను సోమవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సోమన్న గారి రవీందర్ రెడ్డి పరిశీలించారు. రంగంపేట ప్రాథమిక సహకార సంఘానికి వచ్చిన ఆయన డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రమేశ్‌తో మాట్లాడి, ధాన్యాన్ని వెంటనే తూకంవేసి రైస్ మిల్లుకు తరలించేలా చూడాలని కోరారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్ రెడ్డి, రైతులు ఉన్నారు.

జహీరాబాద్‌లో ట్రా‘ఫికర్’

- అడ్డగోలుగా ఆటోలు, వాహనాల పార్కింగ్
- తోపుడు బండ్లదీ అదేతీరు
- పనిచేయని సిగ్నల్స్
- అవస్థల్లో ప్రజలు



జహీరాబాద్ పట్టణంలో అస్తవ్యస్తంగా వాహనాల రాకపోకలు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. ఆటోలు, వాహనాలు ఇష్టానుసారంగా రోడ్లపై నిలపడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమైంది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పట్టణంలో లక్షకు పైగా జనాభా ఉంది. ప్రతీ రోజు గ్రామాల నుంచి పనుల నిమిత్తం చాలామంది రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ట్రాఫిక్ సమస్య తలనొప్పిగా మారింది. వ్యాపార సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, కాలేజీలు, పాఠశాలలు, హాస్పిటల్స్ ఉండడంతో నిత్యం ప్రజలు, విద్యార్థులు వస్తుంటారు. వాహనాలు రోడ్లపైనే పార్కింగ్ చేస్తుండడంతో జనం తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. దుకాణాల్లో వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. అంతర్గత రహదారుల్లోనూ ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. దుకాణాల ముందున్న స్థలంలో సామగ్రి పెట్టడంతో నడవలేని పరిస్థితి ఉంది. పట్టణంలోని భవానీ మందిర్, హనుమాన్ మందిర్, బ్లాక్ రోడ్డు, తహసీల్దారు కార్యాలయం, మెయిన్ రోడ్డు ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. రోడ్లపైనే ఆటోలు, తోపుడు బండ్లను నిలపడం ద్వారా సమస్య రెట్టింపు అవుతుంది. ట్రాఫిక్ నియంత్రణకు ఏర్పాటు చేసిన సిగ్నల్స్ పనిచేయడం లేదు. పట్టణంలోని ప్రధాన రహదారిపై నాలుగైదు చోట్ల ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. కొన్ని రోజులు బాగానే పనిచేసినా ఆ తరువాత అవి వెలగడం లేదు. దీంతో వాహనాలను ఇష్టానుసారం నడిపిస్తూ ఎక్కడబడితే అక్కడ నిలుపుతున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ నియంత్రణకు మున్సిపల్, పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

“ జరిమానా విధిస్తున్నాం



ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులకు జరిమానా విధిస్తున్నాం. ప్రతీ రోజు పోలీసు సిబ్బంది ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. వ్యాపారులు, వాహన చోదకులు, ఆటో డ్రైవర్లు, ప్రజలు ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి.

– రాజబొయిని రవి, సీఐ, జహీరాబాద్